తన ఓటమిని అంగీకరించింది. "నిన్ను బాధపెట్టడం నా అభిమతంకాదు జయదేవ్! నా ఈ దేహానికి కాంతి నశించిపోయింది. ఈ మాలిన్యకాయాన్ని నీ కర్పించలేననే చింత తప్పితే నా కింకేమీ బాధ లేదు" అనే అంతలో సతి కళ్ళల్లోకి మళ్ళీ నూతన అశ్రుకణాలు రెండు నిండుకొచ్చాయి. ఆ నిండు కంటిలో లయమందిన సతీదేవి పార్వతియై వెలసి నట్లుగా కనిపించింది జయదేవుడికి.

అప్రయత్నంగా గాఢపరిష్వంగం జరిగింది. అది సామాన్యమానవమాత్రులికి కేవలం నీచమైన శారీరసంబంధంగానే అర్థమౌతుంది. గాని దాన్ని సరిగా అర్థం చేసుకోడానికి కళాకారులు కుమిలి- కవి తన కవిత్వంలోనూ చిత్రకారుడు తన చిత్రాల్లోనూ-గాయకుడు తన గానంలోనూ తప్ప ఇతర మయిన వాటికి అందనిది. వారు మాత్రమే ఆ శారీరకవిషయలోలత్వంతో సంబంధంలేనిఅలౌకిక ప్రేమను చూడగలరు.

కొండ మల్లెచెట్టు గాలికి గట్టిగా వూగి గాలి తెర నొకదానిని విసిరివేసింది. సలిరులు ఎగిరి వచ్చి జయదేవుని కప్పివేశాయి. జయదేవ్ వివశుడై మత్తుగా "నువ్వు దక్షపుత్రి సతివి కాదు. అది గత జన్మ – నీవు పునీతం చేయబడ్డ పార్వతివి" అన్నాడు. రెక్కరాజు ఫక్కుననవ్వి సిగ్గులేకుండా అక్కడే నిలబడి వున్నాడింకా.

---

క థా ని క

# శాంతిమతి

తాసీరా

ఎంత విశాలమైన నగరమని కలకత్తా! వెడల్పాటి వీధులూ, ట్రాంబళ్ళూ, సుందరమైన పలువన్నెలతో వెలిగిపోయేకార్లూ, సైకిళ్లూ ఎత్తైన సౌధాలు, బాల్ డాన్సుల విలాస మందిరాలు, మద్యపాన గృహాలు! జీవంలేని, అచేతనమైన వస్తువులను చైతన్యవంతం చేసే సుందరమైన యువతులు, వింత వేషభాషల్లో మెలిగే యువకులతో, ఎనిమిది జాములూ, ఆనంద కోలాహలం మిన్నుముట్టుతూ వుంటుంది.

'కిదర్‌పూర్' కలకత్తాలో ఒక పేట. ఆ పేటలో ఒక గల్లీలో ఒక గల్లీలో, డబల్ రోటి, బిస్కట్టులు అమ్మకొనేవాని దుకాణంలో చాల సేపు అయింది. విశేషంగా ఏదో ఆనంద కోలాహలం రేగిపోతుంది. ఒక చిన్న గల్లీ దుకాణం. అంతగా కోలాహలం జరుగుతూంటానికి కారణం, ఒకవిధంగా ఆ దుకాణదారుని ఏకైకపుత్రిక 'శాంతిమతి' తరువాత ఆ దుకాణాన్ని ఆవరించివున్న ఆకర్షణీయమైన అలంకారం, స్వచ్ఛతాను. శాంతిమతి తరుణవయస్క. ఎంత అందమైనవారినైనా, తన వైపు ఆకర్షించుకొనేందుకు, ఆమె సౌందర్యం, చాలవరకు పనికి వస్తుంది.

సంధ్యా సమయమయ్యేసరికి, శాంతిమతి తనకు ప్రియమైన గౌను ధరించి, ఒదులాటిపైజమాను. పైన అందమైన ఒక వల్లెవాటూ వేసికొని మత్తెక్కించే తన బుల్లి పెదవులును లిప్‌స్టిక్‌ను పల్చగా పూసుకొని, చక్కగా ముస్తాబై దుకాణం కౌంటర్ మీదకువచ్చి పడుతుంది. ఆమె రావటంతోనే అదేమిటో అక్కడ ఒక గుంపెడు మంది గుమికూడ్తారు. నాజూకైన చేతుల్తో ఆమె వస్తువు లందిస్తున్నప్పుడు యువకుల అతృప్తమైన ప్రేమదాహం, కోరుతున్న కళ్ళు రెండూ, శాంతిమతి సోయగంలో మునిగి తేలుతాయి. ఇక చివరకు పరవశంనుండి విడుదలై, నీరసంగా, వాళ్లు పాపం అక్కడినుంచి కదలిపోవాల్సి వస్తుంది కాసేపటికి ఏమంటే, వస్తువులు ఇచ్చివేసినపిదప, ఒక్కక్షణం సేపయినా మాటలు సాగించే అవకాశం ఇచ్చేదిగాదు. వెంటనే లోపలికిపోయేది.

శాంతిమతి ఏమంత పెద్దగా చదువుకోలేదు. కాలేజీ చదువుదాకగూడా రాలేదు. అయినా, స్వయంగా కృషిసల్పి, అధునాతనమైన నాగరికతకు సరిపోయే జ్ఞానాన్ని, నవలలు, పుస్తకాల ద్వారా పొందింది. ఆమె ఎవర్నీ ఇంతవరకు

ప్రేమించటం జరగలేదు. ఒక్కసారీ, ఆమెలో కోర్కెలను కన్గొని, మత్తుకనిగించే తమ సౌందర్యంతో, ఆమెకు హృదయోత్సాహం, నేత్రోత్సాహం కలిగించే యువకుడు ఇంతవరకు దుకాణంలో ప్రవేశించలేదు. కనీసం, ఎక్కడన్నా చూడలేదు. ఎంతకూ ఆమె సౌందర్యాన్ని చూచి, మురిసిపోతున్న వారేగాని, ఆమె వారిసౌందర్యాన్ని చూచి, మురిసిపోతుంటం జరగలేదు.

శాంతిమతి నవయౌవని అయినా, ఆమె ముసలి తండ్రి, ఇంతవరకూ వివాహ సమస్యను పరిష్కరించేమార్గమును అసలు చూడ ప్రయత్నం చేయలేదు. దానికి కారణాలు చాలవున్నయ్. కూతురు వివాహం తొందరగా చేసివేయాలని పీడించే తల్లి లేదు. "ఆమే కూతురైనా కొడుకైనా, నాకు మిగిలిన సర్వస్వం" అని అనుకొంటాడు, ముసలి తండ్రి. తరువాత దుకాణం కార్యకలాపాలు ఎక్కువగా ఆమెమీదే ఆధారపడివుండటంవల్లా అవ్వొచ్చు.

ప్రేమోన్మత్తులైన యువకులు చాలామంది, శాంతిమతి తండ్రికి దగ్గిరలో తిరుగుతూ అడిగారు. ముఖపరిచయంగల సాటిదుకాణదార్లు అడిగారు, తమ కొడుక్కు చేసుకుంటామని. కాని వప్పుకో లేదు. తండ్రికీ ఆమెకూ, ఆ రంగేళీయువకులూ, మూర్ఖులు, జల్సాగా తిరిగేవాళ్లు అంటే, గిట్టదు.

## 2

ఒకరోజున సంధ్యవాలింది. ఎవరో అపరిచితుడైన యువకుడు ఆ దుకాణంలో ప్రవేశించాడు. ఎవర్నీ చూచి, ఎవరి సౌందర్యంకీ మురిసిపోని ఆ యువకుని రూపురేఖలు, ముఖంలోనే వ్యక్తమవుతూన్న సుగుణ సంపదగాంచి, శాంతిమతి ఎంతో ఆనందించింది. అతనివంక రెప్పవేయక గోముగా చూస్తూ అంది:

"ఏమండీ! ఏంకావాలి?" గొంతులో మృదువుగా ధ్వనించింది.

"నాకు ఒక చిన్నటి డబుల్‌రొట్టీ కావాలి" అన్నాడాతను.

అతని నిర్మలమైన ముఖాన్నే తిలకిస్తున్నాయి శాంతిమతి కళ్లు. లోపలికి నాలుగడుగులు వేసి, డబల్‌రొట్టీని కౌంటర్ మీద వుంచింది.

"ఎంత ఖరీదు?" ప్రశ్నించాడు యువకుడు.

"అదాండి నాలుగణాలే!" మధురంగా అన్నది.

"అహాఁ, దీనికన్నా నిల్వసరుకులోది పట్టుకురా, నాకదే కావాలి."

ఆమె కళ్ళల్లో అనుకంపం పుట్టుకొస్తూంది. మళ్ళా లోపలికి నాలుగడుగు వేసి, అతనికోరిన సరుకులో పట్టుకొచ్చింది. దాన్ని తీసికొని ఆ యువకుడు నాలుగణాలు అక్కడవుంచి వెనక్కు తిరిగిపోయాడు. కనీసం ఆమె నన్నా చూడకుండా నిర్లక్ష్యంగా వున్నట్లు తరలాడు.

విస్మయంలో చకితురాలై శాంతిమతి అతని నిష్క్రమణంవేపు అలానే చూస్తు వుండిపోయింది. అతను వదలి వెళ్ళిన అవ్యక్త ఉదాసీనత, శాంతిమతి సౌందర్యగర్వాన్ని దెబ్బతీసినట్లుయిందని మనం వూహించకూడదు. ఆమె అసలు అట్లా భావించలేదు. కాసేపటికి తెప్పరిల్లి "సరే! మరోసారి కనబడకపోతాడా" అని మనస్సులో తృప్తి పర్చుకుంది. కాని, అతన్నిగురించే ఆలోచనలు ఆమెను ముంచివేయసాగాయ్. ఎందు కతను ఆ నిల్వసరుకు పట్టుకెళ్లాడు? మంచి సరుకుకొనే తాహతులేదా? అట్లయితే రేపు రెండణాలకు మంచి సరుకే ఇస్తా. తప్పక ఇస్తా. కాని ఈ దుకాణానికే రేపుగూడ వస్తాడా?

మర్నాడూ ఆ యువకుడు తన సహజమైన ఉదాసీనతతో సరిగా ఆ సమయంలోనే దుకాణం ప్రవేశించి రెండణాలు పెట్టి ఆనిల్వసరుకే కావాలని తీసుకవెళ్ళాడు, వచ్చిన అయిదునిమిషాల్లోనే.

శాంతిమతి ప్రాణంలేచి వచ్చింది. అతన్ని చూడటంతోనే ఆమె కళ్ళముందర అతని గంభీర మూర్తిత్వం నాట్యం చేయసాగింది. అతను వెళ్ళిన వెంటనే ఆ గంభీర ప్రకృతిని నెమరు వేసుకో సాగింది. మామూలు వేషభాషలోనే వున్నా అతనిలో ఏదో ప్రభావంగల వ్యక్తిత్వంగూడ వుండి ఉండాలని అనుకొంది.

అప్రయత్నంగా ఆమె భావన ఒక విషయం మీదకుపోయింది. ఆ యువకుని చేతిలో ఏవో కలర్ బాక్సులు వున్నట్టున్నయ్. అతను తప్పక చిత్రకారుడై వుంటాడని నిర్ధారణకు వచ్చింది. చిత్రాలకి బజార్లో విలువలేనందువల్ల ఏదోవిధంగా అట్లానే కార్యాన్ని నడుపుకొస్తూండి వుండాలి.

అట్లా గాకపోతే, ప్రతిరోజూ ఆ శిల్వ డబల్ రోటీ ఎందుకు కావాలంటాడు!

ఒకరోజు ఆ యువకుని పరిచయభాగ్యం కలుగ జేసుకోవాలని మనస్సులో ధృఢపర్చుకుంది. నిశ్చయం ధృఢంగా మారేసరికి, విశేషరూపంగా అలంకరించుకొని, అతనిరాకకై నిరీక్షిస్తూ, నిలబడి వుంది, దుకాణంలో. కాని ఆ నిరీక్షణ ఎక్కువ సేపు అవసరం లేకపోయింది. యువకుడు రోజూ సమయంలోనే వచ్చేశాడు. రోజుమాదిరి కౌంటర్ మీద రెండణాలు విసరి, రోటీ కావాలన్నాడు. శాంతిమతి లోపలకెళ్ళి తనదివరకే చుట్టిపెట్టిన పొట్లాన్ని అతని చేతిలో, పెట్టింది. దాన్ని తీసికొని వెళ్ళేందుకు సిద్ధమవుతున్నాడు. శాంతిమతి కంటిరెప్పలను పైకెత్తి, "ఒక్క ప్రశ్న అడగవచ్చా మిమ్మల్ని!" అని తియ్యగా అంది.

"నన్నా? ఏం ప్రశ్నది?" కొంచెం ఆశ్చర్యం చెంది ఆమెవంక చూస్తూ అన్నాడు.

ఆ మాటకు కొంచెం సిగ్గునభినయించి మెల్లగా "మీ పేరేమిటి?...ఏం చేస్తుంటారు?" అన్నది.

"నాపేరు కిశోర్ బాబు, చిత్రకారుణ్ణి" ఆపైన ఒక చిన్న నవ్వును ద్యోతకం చేస్తూ, నిష్క్రమించాడు.

అతని మాటల్లో ఎంత లాలూచి గోల్పే గూఢత్వ, సమరసత! అది కేవలం శాంతిమతికే తెలుసు. చివర విసరిన ఆ మందహాసం ఇంకా ఆమె నిలరేగుతున్న మధురభావనల్ని చక్కిలి గిడుతూనే వున్నది. వర్షంకురిసిన తరువాత చల్లని గాలి కలిగించే ఆనందం ఆమె పొందుతున్నది. ఆనందంలో ఏదేదో అనుకోసాగికది.

మరుసటిరోజు మధ్యాహ్నం మూడుగంటల నుంచే ఆ యువకునికోసం ఎదురు తెన్నులు చూస్తుంది. ఆనందంలో ఆలోచనలు పనిచేయ మానెను సరిగా. అద్దంముందు నిలబడింది. ఒక్కసారి తన సోయగం తిలకించుకొంది, ఎట్లా వుందో తనని! తృప్తికరంగానేవుంది. దుకాణం లోకిపోయి మంచి తాజాసరుకు డబుల్‌రోటీ వెదకి బయటికితీసి అట్టే పెట్టింది. దాన్ని ముక్కలు చేసి, లోపల వెన్న కూర్చింది. వెన్న ఎందుకు కూర్చిందో ఆమెకే తెలియదు. మళ్ళీ ఆ ముక్కలన్నిటినీ ఒకే డబుల్ రోటీగా కూర్చి, ఒక కాగితంలో చుట్టి, ఒకమూల వుంచింది.

తిరిగి కౌంటర్‌దగ్గరకు వచ్చింది. ప్రియాగమనంకొరకు ఎదురుచూడసాగింది. ఆమె ఇవాళ తెలివితో ప్రవర్తిస్తున్నట్టు లేదు. ఎవరన్నా, వస్తువులు కావాలనివస్తే వారికింక చూడకుండా, దేన్నో గురించి ఆలోచిస్తూంది. వారుగట్టిగా పిలిస్తే పిచ్చిచూపు చూస్తున్నది. మామూలు వేళకే కిశోర్ బాబు వచ్చాడు. ప్రియాగమనంకొరకు వేచియున్న హృదయం స్పందించ సాగింది, శాంతిమతికి రెప్పవేయక చూస్తుంటే, కళ్లల్లో నీళ్ళు వూరినయ్. చెక్కిళ్ళు లజ్జతో ఎరుపుగా మారినయ్. మధురానుభూతి అలలు హృదయంలో కొట్టుకుంటున్నాయ్.

దుకాణానికి రాగానే, మామూలు తీరునే, రెండు అణాలు కౌంటరుమీదవుంచి, డబల్‌రోట్టీ అడిగాడు. శాంతిమతి పిచ్చెక్కిన దానిలాగ చూసింది. లోపలిమూలనున్న ఆ డబల్ రోట్టీ



పొట్లం తీసికొచ్చి, అతని చేతుల్లో, వణకుతున్న చేతుల్లో వుంచింది. అతనిముఖంకేసి చూడసాగింది ముఖంలో మార్పులకై ఆ పొట్లంతీసికొని, నిత్యం మాదిరి ఒక మధురమైన మందహాసాన్ని విసిరి నిష్క్రమించాడు. శాంతిమతి ఆతనువెళ్ళినదారిని నిరాశతో చూసింది. తనెంత తెలివిమాలిన పని చేసింది? ఆ యువకుని కాసేపు కూర్చోమనిచెప్ప గూడదూ? కాసేపైనా అతని చక్కని మాటలు వినే పనికాదూ? ఎంతో ఆనందించే పనిగాదూ? తనకా వూహ ఎక్కడా: అతన్ని చూడడంతోనే ఆ మధురక్షణం అయిపోయిందాయె. శాంతిమతి తిట్టుకుందితన్ను, తన తెలివిమాలిన బుద్ధినీ.

రాత్రి చాలాసేపు ఆలోచిస్తూనే వుండి పోయింది. "ఇపుడు కిశోర్ బాబు ఆ పొట్లం విప్పి వుంటాడు. వేడి టీ త్రాగేసమయంలో దాన్ని నోట్లో వేసుకొంటాడు. ఆహా! దాని రుచినిచూచి ఎంత ఆనందం కలిగిందో అతనికి? అతనికి ఆశ్చర్యంగూడ కలిగివుండాలి. హారి భగవంతుడా, ఏమనుకుంటున్నాడో మనస్సులో? అతడు నిజంగా ఆనందించాడా, లేక నేను చేసినపనికి కోపంగాని వచ్చి తిట్టుకొంటున్నాడా? నన్ను పూర్తిగా జ్ఞాపకంలో వుంచుకొంటాడులే. రేపు వచ్చేటపుడు ఎంత ఆనందంతో వుంటాడో నబ్బా! ఏమో! నిజంగా అట్లా జరుగుతుందా, నిజంగా నేనంత భాగ్యశాలినా!"

శాంతిమతి ఈ ఆలోచనల్లో మునిగితేలుతూ వుంది. బయట ఎవరో వస్తున్నట్టు చప్పుడు వినవస్తుంది. బయటికివచ్చి చూసింది. ఆమె ఆశ్చర్యానికి అంతులేదు. బయట ఒక అపరిచిత వ్యక్తి, అతని పక్క తన ప్రియమైన కిశోర్ బాబు.

శాంతిమతి అతనివంక ప్రేమస్నిగ్ధమైన తన కళ్ళతో చూచింది. అతను వహించిన రౌద్రాకారము చూచి ఆశ్చర్యం, భయంచెందింది. అతని కళ్ళల్లో నిప్పులు చెలరేగుతున్నట్టు, ఎర్రగా జీరలు వున్నయ్. ఎప్పుడూ అతని జుట్టు తీర్చి దిద్దినట్టు చక్కగా వుండేది, ఇవాళింత చిందరవందరగా వుండేమిటి? ఆ చూపుల్లో రోజూలేని ఆ తిరస్కారపు ఛాయలకు ఏమిటికారణం? ఏం తెలియలేదు శాంతిమతికి.

ఆమెనుచూస్తూ అరిచాడు: "మూర్ఖస్త్రీ" ఎంత ఘాతమైనపని చేశావు? చేసినపనంతా కటికి వ్యర్థం. ఎంతకాలం తీసికొని ఆ చిత్రాన్ని పూర్తి చేశానో, ఇపుడదంతా బూడిలోపోసిన పన్నీరు గదా? నా చిరకాలవాంఛల్నన్నీ కూకటివేళ్ళతో పీకివేశావు నువ్వు!"

శాంతిమతి, ఆ మాటలకు త్రుళ్ళిపడింది. హృదయాన్నెవరో ముళ్ళలో పొడిచినట్లయింది. వజ్రాఘాతంమల్లె నాటుకొని పీడుస్తున్నాయ్ ఆమాటలు. కొయ్యబొమ్మలాగయి, టేబిల్ నాను కొని నిలబడగల్గింది. ఆ అకస్మాత్తుగా వచ్చిన ఈ ప్రళయానికి తనేం ఘోరంచేసిందో తెలియ లేదు.

కిశోర్ బాబు వెంటవచ్చిన ఆ అపరిచితుడు, అన్నాడు శాంతిమతి నుద్దేశించి "చూడమ్మా, ఇవాళ మీరుచేసినది ఎంతో అపరాధం. దాన్ని మీరు బుద్ధిపూర్వకంగా చేశారో ఏమో మరి నాకు తెలియదు. మీరు బుద్ధిపొరపాటున చేసినా చేయటం జరిగింది, అదిమాత్రం నిజం. నా యీ మిత్రుడు క్రిందటివారం మొదలు దినమెల్లా ఎంతో పనిచేసి ప్రదర్శనంకొరకు ఒక సుందరమైన చిత్రం తయారుచేశాడు ఎవరు నమ్మినా నమ్మకపోయినా, ఆ చిత్రానికి ఒక వేయిరూపాయిలు బహుమానం తప్పక వచ్చేది.

"విషయం చెబుతున్నాను. మేం చిత్రకారులం మొదట పెన్సిల్ తో స్కెచ్ గీచికొని ఆ పైని రంగునింపే ముందర, ఆ పెన్సిల్ గీతల్ని మెల్లగా చెరిపివేస్తాం. ఆ గీతల్ని చెరిపేందుకు, రబ్బరు బదులు పాసిపోయిన డబల్ రొటీ ఉపయోగిస్తాం. అందుకనే కిశోర్ బాబు గతవారంనుంచీ మీదగ్గర ఆ నిల్వ సరుకు తీసికొస్తున్నాడు. మరి ఇవాళ మీ బుద్ధిహీనమయి పోయినవల్ల, ఇవాళ ఆ డబల్ రొటీ, ముక్కలుచేసి దాంతో వెన్న కూర్చేరు రహస్యంగా. చివరకు జరిగిందిది. పెన్సిలుగీతలు చెరిపే సమయంలో పూర్తి చిత్రం నాశనమయింది. అందుకే దోషమంతా మీదేనని చెబుతున్నాడు. మీవలనే అది ఖరాబయింది."

నేరం చేసిన మనిషి తననేరం తాలూకు వ్యాఖ్యను వింటున్నట్టు వింది శాంతిమతి. నిరాశా రేఖలు ముఖాన్ని కమ్ముకొన్నాయి.

(ఆధారం: ఓ. హెన్రీకథ)